జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 4 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

## మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన దమ్మపేట తహసీల్దార్, యూ/టి డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి

- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి : మంత్రి తుమ్మల



**దమ్మపేట, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట తహసీల్దార్ యూ/టి డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇటీవల దమ్మపేట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మద్దినేని మురళికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో రెవెన్యూ సేవలు అందించడంతో పాటు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని దమ్మపేట తహసీల్దార్ యూ/టి డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళికి మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

- కౌన్సిల్‌లో సాధారణ అభివృద్ధి డీపీఆర్..
- బయట రూ.600 కోట్ల రుణ చర్చ
- 48 గంటల్లో ముగిసిన టెండర్.. ఒక్క సంస్థకే అవకాశం
- ఒక్క సంస్థే బిడ్... 2 శాతం నుంచి 1.6 శాతానికి బేరసారాలు..?
- ప్రతిపాదిత ప్రాజెక్టు విలువపైనే కన్సల్టెన్సీ లెక్క
- టెండర్ ప్రక్రియపై పెరుగుతున్న అనుమానాలు
- పారదర్శకతపై కార్పొరేషన్ వర్గాల్లో ప్రశ్నలు
- ప్రక్రియను రద్దు చేయాలంటూ డిమాండ్..




7 లో..

## కార్పొరేషన్‌లో... 'అశ్వద్ధామ.. కుంజరః' సూత్రం..!

మహా భారత యుద్ధంలో "అశ్వద్ధామ హతః"... కుంజరః అని ధర్మరాజు సగం నిజాన్ని మాత్రమే పెద్దగా చెప్పి, అసలు విషయాన్ని మెల్లగా నమిలేశాడు. ఇప్పుడు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రుణ ప్రణాళిక తీరు చూస్తుంటే సరిగ్గా అదే సంఘటన గుర్తు చేస్తోంది. కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ప్రతిపాదిత రూ. 600 కోట్ల అభివృద్ధి ప్రణాళిక తాలుకు సంబంధించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కన్సల్టెన్సీ, ఆమెద వ్యవహారం, బిడ్డింగ్ నోటిఫికేషన్ ప్రక్రియ, నిర్ణయించిన పర్సెంటేజ్ సరిగ్గా ఆ సూత్రాన్నే ప్రతిబింబిస్తుంది. దీంతో ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు పట్టణంలో పెద్ద దుమారమే రేపుతోంది. దీంతో ప్రజాప్రతినిధులకు, స్థానిక ప్రజలకు కార్పోరేషన్ పెద్దలు పూర్తి విషయాలు చెప్పకుండా... కంటితుడుపుగా సమావేశాల్లో ఆమోదాలు ముద్రించుకుంటూ పోతున్నారని గట్టి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## సింగరేణికి మరో చారిత్రక విజయం..!



- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ దక్కించుకున్న సింగరేణి
- 20 ఏళ్లకు 120 మిలియన్ టన్నుల జీ-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు
- 2 వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ఏరియాకు కొత్త భరోసా
- నెల రోజుల్లో రెండో భారీ విజయం.. ప్రజా ప్రభుత్వ కృషి ఫలితం: భట్టి విక్రమార్క

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 03, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థకు మరో కీలక విజయం దక్కింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు ఏరియాకు అత్యంత కీలకమైన పీకేఓసీ–2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణి సొంతమైంది. ఈ విజయంతో మణుగూరు ఏరియాలో మరో 20 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశాలు ఏర్పడ్డాయి. నెల రోజుల వ్యవధిలో తాడిచర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు లభించడం తర్వాత సింగరేణికి దక్కిన రెండో చారిత్రక

మిగతా 2 లో...

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ను పారదర్శకంగా పూర్తి చేయాలి

- ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీకరణను వేగవంతం చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి)** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2026లో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా

మిగతా 2 లో...

## అథ్లెటిక్స్‌లో పాల్వంచ కి పతకాల పంట

- వాలీబాల్‌లో రన్నరప్‌గా నవ భారత్.
- సీబీఎస్ఈ క్లస్టర్–7 క్రీడల్లో నవభారత్ విద్యార్థుల ప్రతిభ.
- అథ్లెటిక్స్‌లో స్వర్ణం, రజతం, కాంస్యం.
- వాలీబాల్‌లో రన్నరప్‌గా నిలిచిన నవభారత్ జట్టు



**పాల్వంచ, ఆగస్టు 3, ప్రజాజ్యోతి:** సీబీఎస్ఈ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పాఠశాలల మధ్య నిర్వహించిన క్లస్టర్–7 క్రీడా పోటీల్లో నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. అథ్లెటిక్స్, వాలీబాల్ విభాగాల్లో పలు పతకాలు సాధించి తమ సత్తాను చాటుకున్నారు. హైదరాబాద్‌లోని నల్లమల్లారెడ్డి ఫౌండేషన్ పాఠశాలలో జూలై 25 నుంచి 30 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్–7 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 455 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆర్. అభిజ్ఞ అండర్–19 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో

మిగతా 2 లో...

## మందలపల్లిలో రూ.57 లక్షల సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జారే శంకుస్థాపన

- రెవెన్యూ కార్యాలయం సందర్శించి అభివృద్ధి పనులపై సమీక్ష



**దమ్మపేట, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మందలపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికులు, గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. సీసీ రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం గ్రామీణ మహిళలకు ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళితో పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల నుంచి అందుతున్న వినతులు, భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై చర్చించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలని అధికారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఆత్మ కమిటీ చైర్మన్, దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళి, డిపో మేనేజర్, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో పాల్వంచ కి పతకాల పంట

(మొదటి పేజీ తరువాయి...)

రజత పతకం సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. అదే విభాగంలో ఎన్. అనుశ్రీ జావెలిన్ త్రోలో కాంస్య పతకం కైవసం చేసుకొని పాఠశాలకు మరో విజయాన్ని అందించింది. ఈ విద్యార్థులకు ఫిజికల్ డైరెక్టర్ కమ్ అథ్లెటిక్స్ కోచ్ ఎస్. పవన్ కళ్యాణ్ శిక్షణ అందించారు. అదేవిధంగా, గద్వాలలోని ఎస్సార్ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జూలై 29 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్–7 వాలీబాల్ టోర్నమెంట్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 320 జట్లు పోటీపడ్డాయి. అండర్–17 విభాగంలో నవభారత్ పబ్లిక్ స్కూల్ జట్టు అద్భుత ఆటతీరును ప్రదర్శించి ఫైనల్ వరకు చేరి రన్నరప్‌గా నిలిచింది. జట్టులో లిఖిత్, హర్షిత్, శివరామకృష్ణ, ధార్మిక్, హృతిక్, నవాజ్, కృష్ణచైతన్య, హరీష్ సింగ్, చరితార్థ్, హర్షిత్ చరణ్, సాయి సూర్య, ఇశాంత్ సభ్యులుగా ఉన్నారు. వీరికి ఫిజికల్ డైరెక్టర్ అండ్ కోచ్ ఎన్. లక్ష్మీ సమర్థవంతమైన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా నవభారత్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, హెచ్ఆర్ డీజీఎం అండ్ కరస్పాండెంట్ బి. శ్రీనివాస రావు, ప్రిన్సిపల్ ఎన్.వి.కె. ప్రసాద్, సీనియర్ జోన్ కో–ఆర్డినేటర్ శ్రీమతి గోమతి విజేత విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు ఎన్. లక్ష్మీ, ఎస్. పవన్ కళ్యాణ్, టీమ్ మేనేజర్ బి. జనక్ సింగ్లను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లోనూ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

- ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి)** సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డిఆర్ఓ పద్మావతి లతో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, పలు సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన కీలక వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామంలోని పాత ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, దానిని వెంటనే తొలగించి నూతన పాఠశాల భవనానికి ప్రహరీ గోడ మంజూరు చేయాలని కోరారు. అలాగే పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 52 మంది విద్యార్థులు ఉండగా ఒకే తరగతి గది ఉండటంతో బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులతో పరిశీలింపజేసి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలోని కురుమబజార్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీలో ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని బాలాజీనగర్ కాలనీవాసులు పెంట్లం సబ్‌స్టేషన్‌కు 132/33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులు గ్రామ శివారు నుంచి చేపట్టాల్సి ఉండగా కాలనీ మధ్యలో చేపడుతున్నారని, దీనివల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ లైన్ నిర్మాణాన్ని కాలనీ మధ్య నుంచి కాకుండా గ్రామ శివారు నుంచి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల నిమిత్తం సంబంధిత విద్యుత్ శాఖ ఈఈకు ఎండార్స్ చేశారు. గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన బొమ్మల లాలుప్రసాద్ తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల ఒడ్డు భూమిపై అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు పట్టా మంజూరు కాలేదని, సంబంధిత భూమిపై పట్టా మంజూరు చేసి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ను పారదర్శకంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో అమలు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిదిద్దాలని చెప్పారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో అవసరమైన అన్ని వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు బూత్ లెవల్ అధికారుల (బీఎల్‌వోలు) సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి సమగ్రంగా పరిశీలించి, సంబంధిత జాబితాలపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) ధృవీకరణ పొందాలని ఆదేశించారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే వారందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసి ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా చూడాలని సూచించారు. వీవీఐపీలు, వీఐపీల ఓటరు మ్యాపింగ్‌ను సహాయ ఎన్నికల నమోదు అధికారులు స్వయంగా పరిశీలించి ధృవీకరణ పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. డూప్లికేట్ ఎంట్రీలు, ఫోటో మిస్‌మ్యాచ్‌లు, ఏఎస్‌డీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సరిచేయాలని తెలిపారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారు, గుర్తించలేని ఓటర్ల వివరాలను బీఎల్‌వోలు, బీఎల్‌ఏల సమన్వయంతో మరోసారి ధృవీకరించి జాబితాలను నవీకరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసి వంద శాతం నమోదు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 95 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణికి మరో చారిత్రక విజయం..!

(మొదటి పేజీ తరువాయి...)

విజయమిదేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌లో సుమారు 120 మిలియన్ టన్నుల జీ–8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏడాదికి 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్లపాటు బొగ్గు వెలికితీసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2 వేల మందికి ఉపాధి భద్రత లభించడంతో పాటు మణుగూరు ప్రాంత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా భద్రత కూడా మరింత బలోపేతం అవుతుందని వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి పరిరక్షణ, విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని ప్రారంభానికి అడ్డంకులు తొలగించడం, గత నెలలో తాడిచర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడం, ఇప్పుడు మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్‌ను వేలంలో దక్కించుకోవడం వరుస విజయాలుగా పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిని బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనకుండా చేయడంతో రాష్ట్రంలోని విలువైన బ్లాక్‌లు ఇతర సంస్థలకు వెళ్లాయని భట్టి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వేలంలో పాల్గొనేలా నిర్ణయం తీసుకోవడం వల్లే దాదాపు 12 ఏళ్ల తర్వాత సింగరేణికి మరో బొగ్గు బ్లాక్ దక్కిందన్నారు. కోయగూడెం–3, సత్తుపల్లి–3 బ్లాక్‌లను కూడా భవిష్యత్తులో సింగరేణికి దక్కేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణిని మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు సమకూర్చడం, ఉద్యోగ భద్రతను పెంచడం, తెలంగాణకు దీర్ఘకాలిక ఇంధన భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మణుగూరు పీకేఓసీ–2 డిప్‌సైడ్ బ్లాక్ దక్కించుకోవడంపై సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు, కార్మికులకు ఆయన అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ బొగ్గు గనులు, కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి విస్తరించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వెల్లడించారు.

# బంగారం చోరీ కేసులో నిందితురాలి అరెస్ట్

- **49 గ్రాముల బంగారం స్వాధీనం**




**ఇల్లందు, ఆగస్ట్ 3 (ప్రజా జ్యోతి)** పట్టణంలోని కాకతీయ నగర్ లో జరిగిన చోరీ ఘటనలో నిందితురాలిని అరెస్టు చేసి, 49 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇల్లందు డివిస్పి యు వెంకన్న బాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ వివరాలను వెల్లడించారు. ఇల్లందు పట్టణంలోని కాకతీయ నగర్ లో నివసించే వృద్ధ దంపతుల ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న వేమూరి షిబా రాణి అలియాస్ సీత ఆర్థిక ఇబ్బందుల కారణంగా యజమానుల ఇంట్లో బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు పేర్కొన్నారు. జూన్ 7న మధ్యాహ్నం ఇంటి యజమానురాలు నిద్రిస్తున్న సమయంలో బీరువాను తెరిచి బంగారు ఆభరణాలను చోరీ చేయడం జరిగిందన్నారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితురాలి స్వగ్రామానికి తీసుకువెళ్లి భర్తకు అప్పగించినట్లు తెలిపారు. ఆభరణాలలో ఒక బంగారు చైన్ ను ఇల్లందులోని సిఎస్బి బ్యాంకులో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో అప్పులు తీర్చడంతో పాటు వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన బంగారు ఆభరణాలను వారి ఇంట్లోనే దాచిపెట్టిన అనంతరం ఆ బంగారాన్ని ఖమ్మంలో విక్రయించడానికి ఇల్లందు కరెంట్ ఆఫీస్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా, విధుల్లో ఉన్న పెట్రోలింగ్ సిబ్బందికి నిందితురాలి ప్రవర్తన పై అనుమానం వచ్చి విచారించారన్నారు. నిందితురాలి వద్ద నుండి 25 గ్రాముల రెండు వరుసల బంగారు నంతాడు, 20 గ్రాముల నల్లపూసల బంగారు గొలుసు, నాలుగు గ్రాముల కొత్త బంగారు మంగళసూత్రాల జత స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ కొత్తపల్లి ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

## సున్నం రాజయ్య సేవలు చిరస్మరణీయం

- **సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు**



**చర్ల, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి ):** సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ సున్నం రాజయ్య ఆరవ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం చర్ల మండల కేంద్రంలోని బి.ఎస్. రామయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బందెల చంటి అధ్యక్షత వహించగా సీపీఎం మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు కామ్రేడ్ సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సున్నం రాజయ్య మరణించి ఆరు సంవత్సరాలు గడిచినా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. నీతి, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన ఆదివాసీల ముద్దుబిడ్డ సున్నం రాజయ్య ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన సున్నం రాజయ్య పోడు భూములకు హక్కులు, ఇంటి స్థలాల పంపిణీ, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేశారని అన్నారు. అటవీ హక్కుల చట్టం అమలుకు కృషి చేయడంతో పాటు నిరుపేదలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం (100 రోజుల పని) అమలుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బందెల చంటి, చర్ల మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పొడుపుగంటి సమ్మక్క, భీమగొని నవీన్ కుమార్, దొడ్డి హరినాగవర్మ, ఉడుగుల షారోను, వరదల వరలక్ష్మి , కట్టం స్పందన, కొట్టే నవీన్, బోయిళ్ల సాంబశివరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

- **జిఎస్ పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ**



**చర్ల, ఆగస్టు 03(ప్రజాజ్యోతి ):** ఆదివాసీల హక్కులు, షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో రాజకీయంగా మూల్యం చెల్లించక తప్పదని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం చర్ల మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, అటవీ ప్రాంతాలపై వారి ఆధారిత జీవనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం ఆయా ప్రాంతాలను షెడ్యూల్ ప్రాంతాలుగా ప్రకటించిందన్నారు. అనంతరం కాలక్రమేణా గిరిజనేతరులు షెడ్యూల్ ప్రాంతాల్లోకి ప్రవేశించి ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి సారవంతమైన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొనేరు రంగారావు కమిటీ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదివాసీ భూముల అన్యాక్రాంతంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా షెడ్యూల్ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి అసలు హక్కుదారులైన ఆదివాసీలకు తిరిగి అప్పగించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆదివాసీల ఓట్లతో గెలిచి చట్టసభలకు వెళ్లడమే కాకుండా వారి సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల కల్పన, షెడ్యూల్ ప్రాంతాల చట్టాల పరిరక్షణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీరబోయిన అరుణ, మండల ప్రధాన కార్యదర్శి కాయం శ్రీనివాసరావు, సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో గేదె మృతి.. రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం



**ఆళ్ళపల్లి,ఆగస్టు3(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని మలిపెద్ది ప్రభాకర్ కు చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పశువు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీపంలోని ప్రాంతంలో మేత మేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవాహానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. ఘటనతో రైతు మలిపెద్ది ప్రభాకర్ కు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. మృతిచెందిన గేదెకు ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందించాలని రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే ట్రాన్స్ ఫార్మర్ల పరిసరాల్లో విద్యుత్ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

- **సేవాభావం చాటుకున్న నిరంజన్–సౌజన్య దంపతులు**



**చర్ల, ఆగస్టు 03(ప్రజాజ్యోతి ):** చర్ల మండలంలోని రాళ్లపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిరంజన్–సౌజన్య దంపతులు కొత్త దుస్తులను పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. పాఠశాలలోని 31 మంది విద్యార్థులకు దుస్తులు అందజేయగా చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా నిరంజన్–సౌజన్య దంపతులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. రాళ్లపురం గ్రామంలోని విద్యార్థులకు అవసరమైన దుస్తులు, ఇతర సౌకర్యాల కొరత ఉందని మిత్రుడు మద్ది లక్ష్మీనరసింహారెడ్డి ద్వారా తెలుసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం చేయూత అందిస్తే వారు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని అన్నారు .విద్య సమాజాభివృద్ధికి మూలస్తంభమని గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు అండగా నిలిస్తే వారి భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవలకు సంబంధించిన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి సహకారం అందిస్తామని అన్నారు. చర్ల మండల యువ నాయకులు బోరా పెద్దిరెడ్డి, పరిటాల సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త దుస్తులు అందించడం అభినందనీయమని ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని నిరంజన్–సౌజన్య దంపతులు సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. దుస్తులు అందుకున్న విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలుపగా గ్రామస్తులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. సమాజంలోని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు షబీనా, మద్ది లక్ష్మీనరసింహారెడ్డి, గడ్డం సాయి, సృజన్, కొట్టే నవీన్, మూషిక ప్రవీణ్, బాలరాజు, అంగయ్య, భీమయ్య, ఉంగయ్య, గ్రామస్తులు, తల్లిదండ్రులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పులు ఇచ్చి ఆస్తులు తీసుకోవడం చట్ట విరుద్ధం... గుమ్మడి నరసయ్య






**గుండాల ఆగస్టు 3 ప్రజాజ్యోతి** ఏజెన్సీ ప్రాంతంలో అప్పులు ఇచ్చి ఆస్తులు తీసుకోవడం చట్ట విరుద్ధమని మాస్ లైన్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, చంద్ర అరుణ లు అన్నారు సోమవారం గుండాల మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సెంటర్లో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం మాస్ లైన్ మండల కార్యదర్శి కొమరం శాంతయ్య అధ్యక్షతన జరిగింది. గుండాల ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు జరగడం సరైంది కాదని పేర్కొన్నారు వన్ ఆఫ్ సెవెంటీ చట్టం అమల్లో ఉన్న ఈ ప్రాంతంలో పోడు భూములు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో పెట్టుబడులు రైతులకు ఇస్తూనే దాని మాటను అప్పులు ఇస్తూనే ఆస్తులు గుంజుకోవడం చేస్తూ నారని వీరిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు దీన్ని పార్టీ పూర్తిగా ఖండిస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాచర్ల సత్యం, ఈసం శంకర్, పూణెం లక్ష్మయ్య, తెల్లం రాజు, పూణేమ్ మంగయ్య ఈసం చంద్రన్న ఓకే బాబు, ఆజాద్, సొంత సుగుణ రావు, ఎనుగంటి రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 1/70, పీసా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి

- అక్రమ వడ్డీ వ్యాపారుల పై, భూ అక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి ....తుడుం దెబ్బ



**గుండాల ఆగస్టు 3 ప్రజా జ్యోతి** ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పిసా చట్టాలను కచ్చితంగా అమలు చేస్తూ వడ్డీ వ్యాపారులపై, భూ అక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు వట్టం కన్నయ్య, ఫోన్ నెంబర్ బాలకృష్ణ, గుంపిడి వెంకటేశ్వర్లు లు అన్నారు సోమవారం గుండాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ ఆదివాసుల భూములను, ప్రభుత్వములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటూ రియల్ ఎస్టేట్ చేస్తున్నారని ఆరోపించారు. మండలంలో అధికారిక లైసెన్సులు కలిగిన ఏడుగురు వ్యాపారులు ఉండగా, 50 మంది అనధికారికంగా పెట్టుబడులు పెట్టి ఆదివాసులను మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు పూనం శ్రీను, తంగేళ్ల భద్రయ్య, పరస శీను, దుకారపు వీరభద్రం, వజ్జ ఎర్రయ్య, చింత వెంకట్, మోకాళ్ళ కన్నయ్య, మోకాళ్ళ మహేందర్, గోవింద నరసింహారావు, సుతారీ వెంకన్న లక్ష్మయ్య, రామారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికై పాయంను కలిసిన గుండాల మాజీ ఎంపీపీ



**గుండాల ఆగస్టు 3 ప్రజాజ్యోతి** గుండాల మండల అభివృద్ధిని కోరుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు గుండాల మాజీ ఎంపీపీ ముక్తి సత్యం తెలిపారు. సోమవారం మణుగూరులోని సింగరేణి గెస్ట్ హౌస్ లో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ముత్తాపురం నుండి పెత్తోగు న బిటి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని, గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించాలని, పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని తెలిపారు.

## సింగారంలో బాలుడి మృతి ఘటన.. ఆరోగ్య శాఖ అప్రమత్తం

**ఆళ్ళపల్లి. ఆగస్టు3 (ప్రజాజ్యోతి)** సింగారం గ్రామంలో 9 ఏళ్ల బాలుడి మృతి ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వేగంగా స్పందించి సమగ్ర విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. ప్రతాప్, జిల్లా మలేరియా కార్యక్రమ అధికారి డా. శ్రీధర్ గ్రామాన్ని సందర్శించి బాలుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులను కలిసి వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన నివేదికను జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి ద్వారా జిల్లా కలెక్టర్, ప్రజారోగ్య సంచాలకులకు సమర్పించారు. గ్రామంలో వ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వల్ చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 170 మంది గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, (ఆర్‌డీటీ )పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. జ్వరాల పర్యవేక్షణ, దోమల నివారణ చర్యలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో డా. గోపీలాల్, సీహెచ్‌వో నాగభూషణం, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, డీపీఎంఓ పాయం శ్రీనివాసరావు, సర్పంచ్ ఉమ దంపతులు, హెచ్‌ఈ రమాదేవి, ఆళ్ళపల్లి పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా వంగూరి మధు నియామకం

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకుల పిలుపు



**అశ్వాపురం, ఆగస్టు 3, ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్థాగత నియామకాలను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడిగా వంగూరి మధును ఏకగ్రీవంగా నియమించారు. ఈ నియామకం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు సూచనలతో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల రమేష్ మార్గదర్శకత్వంలో ఈ నియామకం చేపట్టారు. అశ్వాపురం మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావులపల్లి నరసింహారావు సమక్షంలో జరిగిన సమావేశంలో వంగూరి మధును మండల ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎస్సీ సెల్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో వంగూరి మధు సమర్థంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వంగూరి మధు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా, మండల నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేస్తూ, ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి తనంత తను కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండ ల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమే ష్ బాబు కాంగ్రెస్ సీనియర్ నాయకు లు గాదకేశవరెడ్డి, మండల సీనియర్ నాయకులు రవి, మల్లెల మడుగు స ర్పంచ్ మచ్చ నరసింహారావు, మనది వెంకన్న, బచ్చు వెంకటరమణ రావులపల్లి నరసింహారావు, పిట్ట ప్రశాంత్, రావులపల్లి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి విశేషాభిషేకాలు

- మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ సీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో భక్తులకు మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్బుగూడెం గ్రామానికి చెందిన సీతారామరెడ్డితో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అన్నదానం సక్రమంగా నిర్వహించబడ్డాయి.



## అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డు దుస్థితిపై సీపీఎం ఆందోళన



- గుంతలతో ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారి
- వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్
- లేనిపక్షంలో భారీ రాస్తారోకోకు హెచ్చరిక

**పాల్వంచ, ఆగస్టు 3, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద జాతీయ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. వెంటనే శాశ్వత రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని, లేదంటే పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ సెంటర్ పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో ఒకటని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. కేటీపీఎస్‌కు వెళ్లే యాష్ లారీలు, ఇసుక లారీలు, సారపాక పేపర్ మిల్లుకు వెళ్లే భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ప్రాంతంలో సంచరిస్తుంటారని చెప్పారు. వ్యాపార సముదాయాలు, సినిమా థియేటర్లు, ప్రధాన కూడలి కావడంతో అంబేద్కర్ సెంటర్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నప్పటికీ, జాతీయ రహదారిపై శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, మంత్రులు సైతం ఇదే మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అంబేద్కర్ సెంటర్ మాత్రమే కాకుండా ఇందిరా కాలనీ నుంచి నవభారత్ మైనింగ్ పెట్రోల్ బంక్ వరకు రహదారిపై అనేక చోట్ల గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా మైనింగ్ పెట్రోల్ బంక్ నుంచి ఇందిరా కాలనీ వరకు జాతీయ రహదారికి పూర్తిస్థాయిలో కొత్త రోడ్డు వేయాలని, ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్‌లో అత్యవసరంగా పనులు ప్రారంభించాలని సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లను పట్టించుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో ని ర్వహిస్తామని, కేసులు నమోదు చేసినా, జైలుకు పంపినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెనుకడుగు వేయబోమని సీపీఎం నాయకులు హెచ్చరించా రు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం. జ్యోతి, కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, పట్టణ కార్యదర్శి పి. తులసిరామ్, కార్యవర్గ సభ్యులు కే. సత్య, ఎస్.కే. నిరంజన్, కమిటీ సభ్యులు వింజ రాములు, బి. కాంతి, బి. మాధవి, సీనియర్ నాయకులు చిటికెన ముసలయ్య, కే. కృష్ణ మూర్తి, బాస నారాయణ, ఎస్.కే. రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



# పోడు రైతుల కేసులో సీపీఐ నాయకులకు విముక్తి


- 2016లో నమోదైన కేసును కొట్టివేసిన కోర్టు
- పోడు సాగుదారులకు అండగా ఉంటాం
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం




**పాల్వంచ, ఆగస్టు 3, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని మొండికట్ట గ్రామంలో 2016 లో పోడు సాగుదారులకు మద్దతుగా నిలిచిన సందర్భంగా సీపీఐ నాయకులు, పోడు రైతులపై నమోదైన కేసును కొత్తగూడెంలోని సెకండ్ అడిషనల్ న్యాయస్థానం కొట్టివేసింది. సుదీర్ఘకాలంగా కొనసాగిన విచారణ అనంతరం సోమవారం న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెలువరించారు.వివరాల్లోకి వెళ్తే.. 2016లో మొండికట్ట గ్రామ పరిసర ప్రాంతాల్లో పోడు సాగు చేస్తున్న రైతులపై అటవీ శాఖ అధికారులు చర్యలకు దిగగా, వారికి మద్దతుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు తదితర పార్టీ నాయకులు అండగా నిలిచారు. ఈ ఘటన అనంతరం అప్పటి అటవీశాఖ అధికారులు సీపీఐ నాయకులతో పాటు పోడు సాగుదారులైన చిల్లా కృష్ణ, ముగెతే వెంకటమత్యం, బాద్ చెన్నయ్య, కందుకూరి మల్లేష్, చిట్ల కుమారస్వామి, నాగేశ్వరరావు, శంకర్, వనపర్తి శ్రీను, తిప్పన కొండల్, వనపర్తి దేవి, తిప్పన రేణుక, వడ్డే భద్రయ్య, వెంకన్న తదితరులు కలిపి మొత్తం 23 మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు.ఈ కేసు కొత్తగూడెం సెకండ్ అడిషనల్ న్యాయస్థానంలో సుదీర్ఘకాలం విచారణకు వచ్చింది. ఇరు పక్షాల వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం సోమవారం కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.సీపీఐ నాయకులు, పోడు సాగుదారుల తరఫున సీనియర్ న్యాయవాదులు వై. ఉదయ భాస్కర్, కోటం రాజు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్ వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ, పోడు సాగుదారుల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. పోడు భూములకు ప్రభుత్వం శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులోనూ పార్టీ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రైవేట్ కొరియర్ సేవలపై వినియోగదారుడి ఆగ్రహం

- విలువైన వస్తువు గమ్యస్థానానికి చేరలేదని ఆరోపణ
- న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు బాధితుడి వెల్లడి






**పాల్వంచ, ఆగస్టు 3, ప్రజాజ్యోతి:** పాల్వంచలోని ఓ ప్రైవేట్ కొరియర్ సంస్థ సేవలపై వినియోగదారుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ న్యాయపరంగా పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కొరియర్ చేసిన విలువైన వస్తువు నెల రోజులకుపైగా గడిచినా గమ్యస్థానానికి చేరకపోవడంతో పాటు, సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు.బొల్లోరిగూడెంకు చెందిన శివలెంక అశ్వినీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఏడాది జూన్ 28న పాల్వంచలోని డీటీడీసీ కొరియర్ కార్యాలయం ద్వారా గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌కు చెందిన సునీపా రాయ్‌కు విలువైన వస్తువును కొరియర్ చేశారు. అయితే నెల రోజులకుపైగా గడిచినా ఆ వస్తువు గమ్యస్థానానికి చేరలేదని ఆయన పేర్కొన్నారు.ఈ విషయమై పలుమార్లు సంబంధిత కొరియర్ కార్యాలయాన్ని సంప్రదించగా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పాటు, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, "ఏం చేసుకుంటారో చేసుకోండి" అనే విధంగా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని అశ్వినీకుమార్ ఆరోపించారు. దీంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరంగా పోరాడాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. కొరియర్ సంస్థ నిర్లక్ష్యం కారణంగా తనకు ఆర్థికంగా, మానసికంగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కొరియర్ సంస్థలు వినియోగదారులకు బాధ్యతాయుతమైన సేవలు అందించాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

## మంత్రి తుమ్మల నివాసంలో అశ్వరావుపేట నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం



**దమ్మపేట, ఆగస్టు 3(ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో సోమవారం అశ్వరావుపేట నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు వివరాలు అందజేశారు.సమీక్షలో అటవీ (ఫారెస్ట్), రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను కోరారు.

## మంత్రి తుమ్మలను కలిసిన దమ్మపేట మండల గిరిజనులు

- గిరిజన పట్టాల సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల
- అధికారులకు తక్షణ చర్యల ఆదేశాలు

**దమ్మపేట, ఆగస్టు 3(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట ప్రాంతానికి చెందిన గిరిజనులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూ పట్టాలకు సంబంధించిన సమస్యలను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువచ్చారు. గిరిజనుల సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి వెంటనే స్పందించి దమ్మపేట తహసీల్దార్, యూ/టి డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళితో పాటు అటవీ శాఖ అధికారులను పిలిపించి సమస్యపై సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు.రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి గిరిజనులు ఎదుర్కొంటున్న పట్టాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: సీఐటీయూ

- ఎన్నికల హామీలు అమలు చేసి వేతనాలు, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లిలో సోమవారం జరిగిన మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సమావేశానికి మండల కమిటీ అధ్యక్షురాలు అనసూర్య అధ్యక్షత వహించారు.సమావేశంలో పిట్టల అర్జున్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులకు రూ.10 వేల వేతన పెంపును వెంటనే అమలు చేయాలని, కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మధ్యాహ్న భోజన మెనూ చార్జీలను రూ.25కు పెంచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రతి సంవత్సరం రెండు జతల కాటన్ యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జంగిలి వెంకటరత్నం, సుగుణ, వెంకటరమణ, మహాలక్ష్మి, రత్తమ్మ, శాంతలక్ష్మి, మస్తాన్ బి, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరితోనే భావితరాలకు భరోసా

- శంభునిగూడెంలో గ్రామసభలో నీటి సంరక్షణపై కీలక నిర్ణయాలు



**టేకులపల్లి,ఆగస్టు03, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం శంభునిగూడెం గ్రామంలో సోమవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టనున్న 'జలసిరి' కార్యక్రమంపై విస్తృతంగా చర్చించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు తమ వ్యవసాయ భూముల్లో కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు.అదేవిధంగా గ్రామ సరిహద్దుల్లో భూగర్భ జలమట్టం పెంచేందుకు ఊట చెరువుల తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించారు. తాగునీరు, సాగునీరు, గ్రామంలోని మౌలిక వసతుల సమస్యలపై గ్రామస్థులతో సమగ్రంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బట్టు శివ మాట్లాడుతూ, భావితరాలకు నీటి కొరత రాకుండా ఉండాలంటే నీటి సంరక్షణ ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్రతి నీటి బొట్టును భూమిలోకి చేరేలా కృషి చేయడం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవు తుందని,జలసంరక్షణ ఉద్యమంలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్వేష్, నాయకులు బట్టు బాబు, సాయి కిరణ్, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలి

- చుంచు రామకృష్ణ



**ఆళ్ళపల్లి,ఆగస్టు3(ప్రజా జ్యోతి )**ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న భద్రాద్రి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించను<న్న మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీల తొమ్మిది తెగల సమన్వయకర్త, చైర్మన్ చుంచు రామకృష్ణ పిలుపునిచ్చారు.ఆళ్ళపల్లి మండలంలోని మర్కోడు గ్రామపంచాయతీ పరిధి పెద్దూరు గ్రామంలో కొమరం వారి ఇలవేల్పు శ్రీ రెక్కల రామక్క ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఆదివాసీల హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు ఐదో షెడ్యూల్, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేయాలని అన్నారు. భూమి, అడవి, నీటిపై ఆదివాసుల హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని ఐక్యంగా ఎదుర్కొని హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే మహాసభకు ఆదివాసీలు, యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెండగట్ల పాపారావు, ఏడబ్ల్యూసీ కార్యదర్శి జోగే రాంబాబు, ఆళ్ళపల్లి మండల ఆదివాసి జేఏసీ అధ్యక్షుడు పాయం రమేష్, పాయం నర్సింహారావు, కొమరం సతీష్, ఊకె ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలు శిక్ష

- ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష
- రూ.25 వేల చొప్పున జరిమానా విధించిన కొత్తగూడెం కోర్టు

**బూర్గంపహాడ్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు కొత్తగూడెంలోని మొదటి అదనపు జిల్లా & సెషన్స్ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా మొదటి అదనపు జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి ఎస్. సరిత ఈ మేరకు తీర్పును ప్రకటించారు.కేసు వివరాల ప్రకారం, 2020 మార్చి 22న భారత్ బంద్ సందర్భంగా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ కు చెందిన అప్పటి సబ్ ఇన్ స్పెక్టర్ బి. బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి సారపాక బస్ స్టాప్ సెంటర్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హోండా స్కూటీపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద నుంచి సుమారు 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితులు మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా గ్రామానికి చెందిన బీమనపల్లి శ్రీనివాసులు, రావీరాల లక్ష్మీనారాయణగా గుర్తించారు. అనంతరం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ లో ఎన్ డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్ఐ కె. సోమేశ్వరరావు కేసు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్ స్పెక్టర్లు పి. నవీన్, టి. సత్యనారాయణ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు, సాక్ష్యాలను కోర్టు పరిశీలించింది. మొత్తం ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నిందితులపై నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది. దీంతో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష అనుభవించాలని కోర్టు పేర్కొంది.ఈ కేసులో ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. ఫణికుమార్ సమర్ధవంతంగా వాదనలు వినిపించారు. కేసు విచారణను విజయవంతంగా పూర్తి చేయడంలో కోర్టు నోడల్ అధికారి డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ అధికారి ఎస్. వీరభద్రం, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ అక్రమ్ సమన్వయంతో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు నేరస్తులకు హెచ్చరికగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి నెల 1వ తేదీన జీతాలు..
- రూ.1.5 కోట్ల బీమా సీఎం నిర్ణయాలు చారిత్రాత్మకం
- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ





**దమ్మపేట, ఆగస్టు 3(ప్రజాజ్యోతి ):** రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రతి నెల 1వ తేదీన జీతాల చెల్లింపుతో పాటు రూ.1.5 కోట్ల వరకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు.'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి, అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తున్న సంక్షేమ చర్యలు, కొత్త విధానాలు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను ఉద్యోగులకు వివరించారు.అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్



**ములకలపల్లి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి ):** ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్ పిలుపునిచ్చారు. సోమవారం జగన్నాథపురం రైతు వేదికలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామంలో ఆదివాసీ జెండాను ఎగురవేసి, ఐక్యంగా దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ, జాతి అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కారం సుధీర్, మడకం చిరుమప్ప, మడకం శ్రీను, పాయం నరసింహారావు, కీసరి ప్రకాష్, పూనెం వెంకటేష్, ఎడమ రమేష్, ఇరప ప్రసాద్, కొడిమె వెంకటేష్, మిడియం నారాయణ, కూరం రామకృష్ణ, సున్నం రాజులు, వివిధ గ్రామాల ఆదివాసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మలకు రైతుల వినతి



**ములకలపల్లి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** ములకలపల్లి మండలంలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం మండలానికి చెందిన రైతులు పర్వతనేని అమర్నాథ్, నరాటి ప్రసాద్, పువ్వాల మంగపతి, బాల అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో పామ్ ఆయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో రైతులు తమ పంటను దూర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోందని, స్థానికంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లభించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించవచ్చని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు

# జగన్నాథపురంలో అంజున మెడికల్ షాప్ ప్రారంభం



**ములకలపల్లి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** మండలంలోని జగన్నాథపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంజున మెడికల్ షాపు గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ సోమవారం ప్రారంభించారు. గ్రామీణ వైద్యుడు సుభాని కుమారుడు అనీద్ ఈ మెడికల్ షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంజా వినోద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచుతూ నమ్మకమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్ ఉస్మాన్ ఖాన్, మండల గ్రామీణ వైద్యుల యూనియన్ నాయకులు కొమ్ము నాగరాజు, డి. సత్యనారాయణ, రాంబాబు, కన్నా, పద్మారావు, రామాచారి, గ్రామ పెద్దలు అడపా నాగేశ్వరరావు, అనుమాల నరసింహారావు, ఇనుగంటి రాము, పోతుగంటి లక్ష్మణ్, దుర్గాప్రసాద్, గౌస్, జగదీశ్, కొప్పుల రాంబాబు, కారం సుధీర్, మడకం శ్రీనివాస్, జబ్బార్, జానీ, కుంజా కృష్ణతో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.




# కార్పొరేషన్‌లో... ‘అశ్వద్ధామ.. కుంజరః’ సూత్రం..!

- కౌన్సిల్‌లో సాదారణ అభివృద్ధి డీపీఆర్..
- బయట రూ.600 కోట్ల రుణ చర్చ
- 48 గంటల్లో ముగిసిన టెండర్.. ఒక్క సంస్థకే అవకాశం
- ఒక్క సంస్థ బిడ్... 2 శాతం నుంచి 1.6 శాతానికి బేరసారాలు..?
- ప్రతిపాదిత ప్రాజెక్టు విలువపైనే కన్సల్టెన్సీ లెక్క
- టెండర్ ప్రక్రియపై పెరుగుతున్న అనుమానాలు
- పారదర్శకతపై కార్పొరేషన్ వర్గాల్లో ప్రశ్నలు
- ప్రక్రియను రద్దు చేయాలంటూ డిమాండ్..

**మహా భారత యుద్ధంలో "అశ్వద్ధామ హతః"... కుంజరః అని ధర్మరాజు సగం నిజాన్ని మాత్రమే పెద్దగా చెప్పి, అసలు విషయాన్ని మెల్లగా నమిలేశాడు. ఇప్పుడు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రుణ ప్రణాళిక తీరు చూస్తుంటే సరిగ్గా అదే సంఘటన గుర్తు చేస్తోంది. కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ప్రతిపాదిత రూ. 600 కోట్ల అభివృద్ధి ప్రణాళిక తాలుకు సంబంధించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కన్సల్టెన్సీ, ఆమెద వ్యవహారం, బిడ్డింగ్ నోటిఫికేషన్ ప్రక్రియ, నిర్ణయించిన పర్సెంటేజ్ సరిగ్గా ఆ సూత్రాన్నే ప్రతిబింబిస్తుంది. దీంతో ఈ మొత్తం వ్యవహారం ఇప్పుడు పట్టణంలో పెద్ద దుమారమే రేపుతోంది. దీంతో ప్రజాప్రతినిధులకు, స్థానిక ప్రజలకు కార్పొరేషన్ పెద్దలు పూర్తి విషయాలు చెప్పకుండా... కంటితుడుపుగా సమావేశాల్లో ఆమోదాలు ముద్రించుకుంటూ పోతున్నారని గట్టి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ♦ కౌన్సిల్‌లో సాదారణ డీపీఆర్ గానే ప్రతిపాదన..?

గత జూన్ 6న జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆరో అంశంగా ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ (టిఓడి) ప్రాజెక్టుకు సంబంధించి కాన్సెప్ట్ నోట్, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారీ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) ద్వారా కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసేందుకు అనుమతి కోరుతూ ప్రతిపాదనను సభ్యుల ముందుంచారు. ఈ సమావేశ అజెండాలో డీపీఆర్ తయారీ, కన్సల్టెన్సీ ఎంపిక అంశాలే స్పష్టంగా ఉండగా, అదే ప్రక్రియ ప్రతిపాదిత భారీ రుణ ప్రణాళికకు సభందించిందని అందులో ఎక్కడ పేర్కొనలేదు. దీంతో తమ ముందుకు వచ్చిన ప్రతిపాదనను ఆభివృద్ధి ప్రణాళిక తాలుకు సాధారణ డీపీఆర్ అంశంగానే భావించి ఆమోదించామని, తర్వాత అది రూ.600 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలో భాగమని తెలిసిందని కౌన్సిలర్లు చెబుతున్నారు. దీంతో కౌన్సిల్‌లో సమర్పించిన ప్రతిపాదన, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియ మధ్య పూర్తి వివరాలు సభ్యులకు వెల్లడించకుండ ‘కుంజరః’ తంత్రాన్ని ఉపయోగించారని చర్చ నడుస్తోంది.

### ♦ 48 గంటల్లోనే టెండర్..!

ఇక కౌన్సిల్ ఆమోదం అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ జూన్ 20న డీపీఆర్ కన్సల్టెన్సీ టెండర్ నోటిఫికేషన్ ను ఓ పత్రికలో యాడ్ రూపేన ప్రచురింప చేసి కార్పొరేషన్ వర్గం విడుదల చేసింది. అందులో జూన్ 20 సాయంత్రం 4 గంటల నుండి ఈ ప్రక్రియ మొదలై 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు బిడ్ల స్వీకరణకు గడువు ముగుస్తోందని పేర్కొంది. దీంతో పాటు అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు టెక్నికల్ బిడ్లు తెరిచేలా షెడ్యూల్ ను రూపొందించింది. అంటే డీపీఆర్ వంటి కీలక కన్సల్టెన్సీ ఎంపిక ప్రక్రియ మొత్తం 48 గంటల్లోనే పూర్తయ్యిందన్నమాట. అయితే ఈ టెండర్ నిబంధనల్లో టిఓడి, అర్బన్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్, ఫైనాన్షియల్ ప్లానింగ్, పిపిపి ప్రాజెక్టుల అనుభవంతో పాటు నిపుణుల బృందం తప్పనిసరిగా ఉండాలని భారి షరతులు విధించారు. కాని ప్రక్రియకు మాత్రం రెండు పొద్దులు కూడా సమయం ఇవ్వలేదు. దీంతో చివరకు ఒక్క సంస్థ మాత్రమే బిడ్డింగ్‌లో పాల్గొనడం, అదే సంస్థకు అర్హత కల్పించడం వంటి సంఘటనలను చూస్తుంటే.. అదుకారులు నిభంధనలను ‘హతః’ చేసినట్టు పలువురూ ఆరోపిస్తున్నారు.

### 2 శాతం కోట్... చివరకు 1.6 శాతం..!

టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కన్సల్టెన్సీ ఫీజు అంశం మరింత ఆసక్తికరంగా మారింది. కేవలం డిపిఆర్ తయారి కోసమే పాల్గొన్న ఈ ఒక్కగాను ఒక్క సంస్థ తొలుత ప్రాజెక్టు విలువలో 2 శాతం మేర కన్సల్టెన్సీ ఫీజును కోట్ చేసినట్లు సమాచారం. అనంతరం జరిగిన చర్చల తర్వాత ఆ రేటును 1.6 శాతానికి తగ్గించినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రస్తుతానికి కన్సల్టెన్సీ ఫీజు 1.6 శాతం వద్ద ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే ఈ శాతం ఎంత మొత్తంగా మారుతుందనేది తుది ప్రాజెక్టు విలువపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం రూ.600 కోట్లను ప్రతిపాదనగా చూపుతున్నప్పటికీ, డీపీఆర్ పూర్తయ్యాక సంబంధిత ఆర్థిక సంస్థలు ఎంత మొత్తాన్ని ఆమోదిస్తే అదే ప్రాజెక్టు విలువగా పరిగణిస్తారు. ఆ విలువ ఆధారంగానే కన్సల్టెన్సీ ఫీజు కూడా నిర్ణయించబడుతుంది. ఉదాహరణకు రూ.600 కోట్లు ఆమోదమైతే 1.6 శాతం ప్రకారం కన్సల్టెన్సీ ఫీజు సుమారు రూ.9.60 కోట్లు అవుతుంది. రూ.500 కోట్లు ఆమోదమైతే రూ.8 కోట్లు, రూ.400 కోట్లు ఆమోదమైతే రూ.6.40 కోట్లు అవుతుంది. ఇవి కేవలం లెక్కింపు ఉదాహరణలు మాత్రమే. అయితే ఇంజినీరింగ్ రంగానికి చెందిన నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇలాంటి ప్రాజెక్టుల్లో కన్సల్టెన్సీ ఫీజు కొన్ని సందర్భాల్లో స్థిర మొత్తంగా, మరికొన్ని సందర్భాల్లో ప్రాజెక్టు విలువలో శాతం ప్రాతిపదికన నిర్ణయిస్తారని పేర్కొంటున్నారు. ప్రదానంగా పోటీ ఎక్కువగా ఉంటే చాలా తక్కువ రేటుకు సేవలు పొందే అవకాశం కూడా ఉంటుందని చెబుతున్నారు. దీంతో ఈ టెండర్‌లో ఒక్క సంస్థ మాత్రమే బిడ్ దాఖలు చేయడం, ఆ తర్వాత కోట్ చేసిన రేటుపై చర్చలు జరగడం వంటి పరిణామాలు చూస్తుంటే కన్సల్టెన్సీ ద్వారా ‘అశ్వద్ధామ’ ను కొందరు కాజేయాలని చూసారని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఒక్క సంస్థే పాల్గొంది

– సుజాత, కమిషనర్,
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ (అధికారిని వివరణ )



"రూ.600 కోట్లు తుది రుణం కాదు. డీపీఆర్ పూర్తయ్యాక ఎంత మొత్తం ఆమోదమైతే అదే ప్రాజెక్టు విలువగా పరిగణిస్తాం. టెండర్‌లో ఒక్క సంస్థ మాత్రమే పాల్గొంది. మొదట 2 శాతం కోట్ చేయగా, చర్చల తర్వాత 1.6 శాతానికి తగ్గించాం. ఈ సంస్థ పని కేవలం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారు చేసి ఇవ్వడం మాత్రమే. ప్రారంభంలో రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు మాత్రమే చెల్లింపు ఉంటుంది. మిగిలిన మొత్తం ఒప్పందంలోని నిబంధనల ప్రకారం దశల వారీగా చెల్లిస్తాం."

## ప్రక్రియను రద్దు చెయ్యాలనే డిమాండ్

మొత్తంగా చూస్తే కొత్తగూడెం కార్పొరేషన్ ప్రతిపాదించిన రూ.600 కోట్ల అభివృద్ధి ప్రణాళికలో అసలు చర్చ ఇప్పుడు రుణంపై కాకుండా, ఆ రుణానికి పునాది వేస్తున్న డీపీఆర్ కన్సల్టెన్సీ ప్రక్రియపైనే కేంద్రీకృతమైంది. కౌన్సిల్‌లో డీపీఆర్ ప్రతిపాదనకు ఆమోదం, ఆ తర్వాత కేవలం 48 గంటల్లో టెండర్ ప్రక్రియ పూర్తి కావడం, ఒక్క సంస్థ మాత్రమే బిడ్ దాఖలు చేయడం, మొదట 2 శాతం కోట్ చేసిన రేటు చివరకు 1.6 శాతానికి తగ్గడం, తుది ఆమోదిత ప్రాజెక్టు విలువ ఆధారంగానే కన్సల్టెన్సీ ఫీజు నిర్ణయించబడనున్న పరిస్థితి వంటి పరిణామాలన్నీ ఈ ప్రక్రియపై చర్చను మరింత ఉధృతం చేశాయి. మహాభారతంలోని "అశ్వద్ధామ హతః... కుంజరః" సంఘటనలో వినిపించిన సమాచారం ఒకటి, దాని పూర్తి అర్థం మరొకటి అన్నట్లుగా, కౌన్సిల్‌లో ఆమోదం పొందిన ప్రతిపాదనకు, ప్రస్తుతం అమలవుతున్న ప్రక్రియకు మధ్య తేడాలపై పట్టణంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం ప్రక్రియను సమగ్రంగా సమీక్షించి అవసరమైతే రద్దు చేసి, పూర్తిస్థాయి పారదర్శకతతో మళ్లీ టెండర్ ప్రక్రియ చేపట్టాలని కొందరు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు ఈ ప్రక్రియ కొందరికి అనుకూలంగా మలిచేందుకు వ్యవహరించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఇక ఈ అంశంపై కార్పొరేషన్ యాజమాన్యం, కౌన్సిల్ తదుపరి దశలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.